గంజాయి విక్రేతల పట్టివేత

శ్రీరాంపూర్, అక్టోబర్ 13 : శ్రీరాంపూర్ ఏరియాలో ఈ నెల 21న సాయంత్రం ఆర్కే 6 మైన్ రోడ్డులో చెట్ల పొదల్లో గంజాయి విక్రయం, తాగడానికి ప్రయత్నించిన ఇద్దరు యువకులను పట్టుకున్నామని ఎస్ఐ సంతోష్ పేర్కొన్నారు. దెబ్బటి నవదీప్, వడ్డె పల్లి యశ్వంత్ వద్ద నుంచి 210 గ్రాముల గంజాయితో పాటు రూ.200 నగదు, మోటార్ సైకిల్, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మందమర్రిలో..

మందమర్రి, అక్టోబర్ 22: గంజాయిని రవాణా చేయడంతో పాటు విక్రయిస్తున్న ముగ్గురిని మందమర్రి పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మందమర్రి సీఐ శశేధర్ రెడ్డి వివరాలు వెల్లడించారు. పట్టణ అదనపు ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో రైల్వే స్టేషన్ సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గమనించి పారిపోతుండగా వారిని పట్టుకోగా వారి వద్ద గంజాయి దొరికింది. పట్టుబడిన వారిలో మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని బుర దగూడెంకు చెందిన మక్కల గంగాధర్, బండారి వరుణ్, బండారి మధుసూదన్ ఉన్నారు. రూ.12,500 విలువైన 400 గ్రాముల గంజాయి, ఒక సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మక్కల గంగాధర్‌పై మందమర్రి, బెల్లంపల్లి పోలీస్ స్టేషన్లలోనూ కేసులున్నట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కన్నెపల్లి, అక్టోబర్ 22 : మండలంలోని వీగాం గ్రామంలో పేకాడుతున్న వారిని అరెస్టు చేసినట్లు కన్నెపల్లి ఎస్ఐ గంగారాం తెలిపారు. 9 మందిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ. 750 నగదు, 5 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు గాండ్ల మల్లేశ్, నన్న రాకేశ్, గుజ్జ గుండయ్య, సాయిల్ల భీమేశ్, నస్పూరి రమేశ్, నన్న వెంకటేశ్, నన్న రాజేశ్, గాండ్ల రామకృష్ణపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దేశీదారు పట్టివేత

కాగజ్‌నగర్, అక్టోబర్ 22: కాగజ్‌నగర్ పట్టణంలోని సంఘం బస్తీలో దేశీదారు సీసాలను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. పట్టణ సీఐ తుత్తూరు శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం తమకు అందిన పక్కా సమాచారం మేరకు పట్టణ ఎస్ఐ సుధాకర్ తన సిబ్బందితో దాడులు నిర్వహించగా సంఘం బస్తీకి చెందిన అక్కపాక సాంబయ్య ఇంట్లో రూ.1,050 విలువైన 30 దేశీదారు సీసాలు లభ్యమైనట్లు తెలిపారు. సాంబయ్యపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

అడవి పందుల బీభత్సం

చింతలమానేపల్లి, అక్టోబర్ 22 : మండలంలోని ఆయా గ్రామాల్లో పత్తి చేన్లను అడవి పందులు ధ్వంసం చేస్తూ బీభత్సం సృష్టిస్తున్నాయి. తాజాగా చింతలమానేపల్లి శివారులో రెండు ఎకరాల్లోని పత్తి పంటను అడవి పందులు ధ్వంసం చేశాయి. అడవి పందుల బెడదను నివారించి పంటలను కాపాడాలని, నష్టపోయిన పంటలకు పరిహారం అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

నిందితులను శిక్షించాలి

బెల్లంపల్లి, అక్టోబర్ 22 : కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఇఫ్ట్యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని కాంటా చౌరస్తా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, వెంకటి, కృష్ణవేణి, సునీత, దేవమ్మ, బుచ్చమ్మ, కుమార్, లక్ష్మి, అమృత పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

మందమర్రి, అక్టోబర్ 22: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు కుర్మపల్లి బస్ స్టేజీ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సిబ్బంది అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. స్థానికులు, వార్డు కౌన్సిలర్ పనాస రాజు మున్సిపాలిటీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో సిబ్బందితో అధికారులు వచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్, వేల్పుల శ్రీనివాస్ తదితరులున్నారు.

విద్యుత్‌ఘాతంతో గాయాలు

హాజీపూర్, అక్టోబర్ 22 : మండలంలోని ముల్కల్ల గ్రామానికి చెందిన గోలివాడ చంద్రయ్య అనే వ్యక్తి విద్యుత్‌ఘాతంతో కాలిపోయి తీవ్రగాయాల పాలయ్యారు. ముల్కల్ల గంగపుత్ర కాలనీకి చెందిన గోలివాడ చంద్రయ్య కూలి పని చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం చంద్రయ్య వ్యవసాయ పనుల నిమిత్తం ముల్కల్ల శివారు ప్రాంతానికి వెళ్లగా అక్కడే అప్పటికే తెగిపడి ఉన్న భారీ విద్యుత్ వైరును గమనించకుండా ముట్టుకోవడంతో విద్యుత్‌ఘాతానికి గురయ్యాడు. ఆ మంటల చంద్రయ్య శరీరం కాలిపోయింది. రోడ్డు వరకు వచ్చి కేకలు వేయడంతో స్థానికులు, బంధువులు వచ్చి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి వరంగల్‌కు తరలించినట్లు సమాచారం. చంద్రయ్యకు భార్య సుగుణ, కుమారుడు రవి, కుమార్తె కవిత ఉన్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నస్పూర్, అక్టోబరు 22 : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు రావాల్సిన ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ పేర్కొన్నారు. పీడీఎస్‌యూ 50వ అర్ధశతాబ్ది వారోత్సవం సందర్భంగా మంగళవారం మంచిర్యాలలోని మైనార్టీ ఫంక్షన్‌హాలులో సభ నిర్వహించారు. ఈ నెల 24న హైదరాబాద్‌లో జరిగే పీడీఎస్‌యూ భారీ బహిరంగ సభకు విద్యార్థులు, నాయకులు, పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

లక్షెట్టిపేట, అక్టోబర్ 22: జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు పట్టణంలోని బాలికల గురుకులానికి చెందిన ముగ్గురు విద్యార్థినులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమాకల్యాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి మూడు రోజుల పాటు నారాయణపేట జిల్లా దవ్వాడలో అండర్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో అండర్-17విభాగంలో పాఠశాలకు చెందిన శాలిని, స్పందన, సహస్ర ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టులో పాల్గొని ప్రతిభ చూపారు. నేటి నుంచి ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి క్రీడల్లో వీరు పాల్గొనున్నారు. ఈ సందర్భంగా వీరిని ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్‌రావు, పీఈటీలు మమత, నవ్య, అధ్యాపకులు విద్యార్థులు అభినందించారు. జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు సాగనంపారు.

సమీకృత వ్యవసాయంపై అవగాహన

మందమర్రి రూరల్, అక్టోబర్22: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, జగిత్యాల, సిరిసిల్ల కళాశాలలకు చెందిన విద్యార్థులకు మండల వ్యవసాయ అధికారి గాదర్ల కిరణ్మయి సమీకృత వ్యవసాయ విధానంపై అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని బొక్కలగుట్ట గ్రామపంచాయతీకి చెందిన ఎడ్ల రాజలింగు సమీకృత వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయం, పాడి, చేపల పెంపకం, కోళ్ల పెంపకం, తేనె టీగల పెంపకం తదితర చిన్నతరహా పరిశ్రమలు, వ్యర్థాల వినియోగంపై అవగాహన కల్పించారు. సారంగపల్లిలో డ్రోన్ పరికరం ద్వారా పురుగు మందుల పిచికారీపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ముత్యం తిరుపతి, సయిండ్ల కనకరాజు, విద్యార్థులు తిరుపతి, శ్రీధర్, నవితేజ, శ్రీచరణ్, విపిన్ తదితరులు ఉన్నారు.

డాక్టరేట్ సాధించిన అధ్యాపకుడికి సన్మానం

చెన్నూర్ రూరల్, 22: చెన్నూర్ మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగంలో గెస్ట్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న దారిశెట్టి కృష్ణ గోపాల్ రావు పీహెచ్‌డీ డిగ్రీని సాధించిన సందర్భంగా మంగళవారం ఆయనను కళాశాల సిబ్బంది సన్మానించారు. ఉత్తర ప్రదేశ్ సహారాపూర్‌లోని గ్లోకల్ యూనివర్సిటీ నుంచి జంతు శాస్త్రం విభాగంలో ఇన్విస్టిగేషన్ ఇన్‌టూ ఆడాలసిస్ అపర్నెస్ అండ్ యాంటీ యాటి ట్యూడ్ రికార్డింగ్ రిఫ్రొడక్టింగ్ హెల్త్ అనే అంశంపై పరిశోధించి డాక్టరేట్ సాధించారు. ప్రిన్స్‌పాల్ ఎంవీ పట్వర్ధన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

తాండూర్, అక్టోబర్ 22 : తాండూర్ కాంగ్రెస్ పార్టీ నాయకుల విజ్ఞప్తి మేరకు మంగళవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తాండూర్‌లోని రేచిని రోడ్డు రైల్వే సమస్యలు పరిష్కారానికి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌ను సికింద్రాబాద్‌లో కలిసి మాట్లాడారు. రేచిని రోడ్డు రైల్వే స్టేషన్ పుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పొడిగింపు, సింగరేణి, రామగిరి ట్రాన్స్ హాల్టింగ్ సౌకర్యం, రైల్వే స్టేషన్ లో పలు అభివృద్ధి పనులు, మౌళిక సదుపాయాలపై విన్నవించినట్లు తెలిపారు. ఇందుకు జీఎం సానుకూలంగా స్పందించి అధికారులకు ఆదేశాలిచ్చారు. ఎమ్మెల్యే వెంట సూరం రవీందర్ రెడ్డి, గట్టు మురళధర్‌రావు, సాలిగామ బానయ్య ఉన్నారు.

అక్రమ కట్టడాలను నిలిపివేయాలి

తాండూర్, అక్టోబర్ 22 : తాండూర్ శివారులో సర్వే నంబర్ 612/7/3/1లో గుర్తుతెలియని వ్యక్తులు అక్రమ కట్టడాలు చేస్తున్నారని తాండూర్‌కు చెందిన నజీమొద్దీన్‌ఖాన్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం తాండూర్ ప్రెస్ క్లబ్‌లో నజీమొద్దీన్ విలేకరులతో మాట్లాడుతూ.. తమ కుటుంబానికి చెందిన ఈ భూమిలో గతంలో కొందరు కబ్జా చేసుకుని ఉండగా బెల్లంపల్లి కోర్టులో పిటిషన్ వెసినట్లు తెలిపారు. కట్టడాలు నిర్మించవద్దని కోర్టు స్టే ఇచ్చిందన్నారు. ఈనెల 10న కొందరు బోరు వేసి అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని తెలిపారు. తాండూర్ గ్రామపంచాయతీతో పాటు కలెక్టర్ కార్యాలయం, రిజిస్ట్రేషన్ ఆఫీస్, తాండూర్ తహసీల్ ఆఫీస్‌కు సైతం రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

తాండూర్, అక్టోబర్ 22 : తాండూర్ సర్కిల్ మాదారం పోలీస్ స్టేషన్ పరిధిలోని వాసాలమడ గిరిజన గ్రామంలో మాదారం ఎస్ఐ సౌజన్య ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో కలిసి కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్స్, నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై జరిమానా విధించారు. సైబర్‌క్రైమ్, డయల్-100, షీ టీమ్, గుడుంబాతో మోటార్ వెహికల్ చట్టం, మూఢ నమ్మకాలు, గంజాయి నిర్మూలన తదితర అంశాలపై సీఐ కే కుమారస్వామి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భీమిని, కన్నెపల్లి ఎస్ఐలు విజయ్‌కుమార్, గంగారాం, సిబ్బంది రమేశ్, వెంకన్న, అశ్విని, తులసీరాం, అశోక్, విజయ్ పాల్గొన్నారు.

అయోడిన్ ఉప్పునే వాడుదాం

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 22: ఆయోడిన్ కలిగిన ఉప్పునే వాడుదామని మంచిర్యాల డీఎంహెచ్‌వో హరీశ్ రాజ్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా వైద్యాధికార్యాలయంలో వైద్యాధికారులతో కలిసి అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు ప్రసాద్, సుధాకర్ నాయక్, డీడీఎంహెచ్‌వో అనిల్, సూపరింటెండెంట్ విశ్వేశ్వర రెడ్డి, డెమో వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 22 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేసే వంగ మహేందర్‌రెడ్డిని ఎమ్మెల్సీ గెలిపించాలని పీఆర్‌టీయూటీఎస్ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి రాసపల్లి రవి పేర్కొన్నారు. టీచర్ ఎమ్మెల్సీ ఓటరు నమోదులో భాగంగా మంగళవారం నస్పూర్‌లోని తీగల్‌పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటరు నమోదు పత్రాలను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మండల శాఖ అధ్యక్షుడు నాగరాజు, హెచ్ఎం రామన్న, వేణుగోపాల్, ఆనంద్, చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

డీపలను వెంటనే విడుదల చేయాలి

చెన్నూర్ రూరల్, అక్టోబర్ 22: జూలై 2022 నుంచి నేటి వరకు రావాల్సిన 5 డీపలను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని మంచిర్యాల జిల్లా (తపస్) సంఘం అధ్యక్షుడు సయింపు శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. తపస్ రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు పొక్కూర్‌లో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో మంగళవారం నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా ఉపాధ్యక్షులు సింగిరెడ్డి సాంబయ్య, కొట్టె నాగరాజు, జిల్లా కార్యదర్శి తోడె తిరుపతి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

జైపూర్, అక్టోబర్ 22: ఎన్టీపీపీలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి ఒక్కరోజు సమ్మె చేపడుతామని, స్పందించకుంటే నిరవధిక సమ్మె చేపడుతామని తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి, అక్టోబర్ 22 : సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టీవీటీయూసీ ప్రధాన కార్యదర్శి మణిరాంసింగ్ డిమాండ్ చేశారు. వేతనాల పెంపు కనీసం రూ.26వేలు తగ్గకుండా ఉండాలని పేర్కొన్నారు. దసరా పండుగ సందర్భంగా లాభాల వాటాను రూ. ఐదు వేలు చెల్లించలేదని ఆరోపించారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు గద్దల నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

కుమ్రం భీంకు నివాళి

కుమ్రం భీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కొలావార్ నాయకులు

ఆసిఫాబాద్ టౌన్,అక్టోబర్22: నాటి గిరిజన వీరుల పోరాట పటిమ నేటి తరానికి ఆదర్శప్రాయమని జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. కుమ్రం భీం పుట్టిన గ్రామం మండలంలోని రౌటసంకెపెల్లిలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని రమాదేవి అధ్యక్షతన గిరిజన ఉత్సవాల పేరుతో నిర్వహించిన కుమ్రం భీం జయంతి, భీం అనుచరుడు ఎడ్లకొండు జయంతి సభకు ఏఎస్పీ ప్రభాకర్ రావు, డీఎస్పీ కరుణాకర్, ఆర్డీవో లోకేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర రావు, ఎంపీపీ మల్లికార్జున్, తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బుర్స పోచయ్య, విజయ్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా గిరిజన సంస్కృతి సంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలు చేసి కుమ్రం భీం, ఎడ్లకొండ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ ఆదివాసీల సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. రౌటసంకేపల్లి అభివృద్ధి కోసం నివేదికల రూపొందించామన్నారు. ఏజెన్సీ డీఎస్సీ, జీవో నంబర్ 3, పెసా చట్టం లాంటి వాటికోసం ప్రభుత్వంతో మాట్లాడుతున్నట్లు వివరించారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ ఆదివాసుల అభివృద్ధి కోసం తాను ఎమ్మెల్యేగా ఉండగా కృషి చేసినట్లు తెలిపారు. మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట్నాక విజయ్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా ఆదివాసీల అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. మాజీ జడ్పీటసీ నాగేశ్వర రావు మాట్లాడుతూ కుమ్రం భీమ్ పోరాటం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లికార్జున్, ఆదివాసీ సంఘాల నాయకులు అర్జు, తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ కుమార్, కుమ్రం భీం వారసులు వెంకటేశ్, రాము, సీతారాం, ఎడ్లకొండ వారసులు బక్కయ్య, కొండు, మాజీ సర్పంచ్ కిష్టయ్య, నాయకులు ఆదివాసీలున్నారు.

తెలంగాణ భవన్‌లో..

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 22: 'జల్ జంగన్ జమీన్' కోసం ఉద్యమించిన ఆదివాసీ ముద్దు బిడ్డ కుమ్రం భీం జయంతి మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కుమ్రం భీం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట, అక్టోబర్ 22 : కాసిపేట మండలం

కాసిపేట : దేవాపూర్‌లో..

భీమారం : బూర్గుపల్లిలో..

రౌటసంకేపల్లి సభకు హాజరైన అదనపు కలెక్టర్

రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మెరుగైన వైద్య సేవలందించాలి

బెల్లంపల్లి, అక్టోబర్ 22 : ప్రభుత్వ దవాఖానలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మంగళవారం ఆయన వంద పడకల దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిసెప్షన్ కౌంటర్, మందుల నిల్వలు, రిజిస్టర్లు, రికార్డులు తనిఖీ చేసి వార్డులను పరిశీలించారు. రోగులకు అవసరమైన మందుల నిల్వలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని తెలిపారు. రోగులతో మాట్లాడి వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. దవాఖానలోని డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. అభివృద్ధి పనులపై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, చైర్‌పర్సన్ జక్కుల శ్వేతతో సమీక్షించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు.

కన్నెపల్లి, అక్టోబర్ 22 : మండలంలోని చర్లపల్లిలోని ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణ పనులను కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించి పలు సూచనలు చేశారు.

భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

నస్పూర్, అక్టోబర్ 22 : జాతీయ రహదారుల కోసం భూసేకరణ పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, రవాణా శాఖ కార్యదర్శి దాసరి హరిచందన అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. మంచిర్యాల-వరంగల్-ఖమ్మం-విజయవాడ జాతీయ రహదారి 163జీ 334 కిలోమీటర్ల మేర ఉంటుందని, ఇందుకు 1,383 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉంటుందన్నారు. ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల జాతీయ రహదారి 63 నిర్మాణం, 132 కిలోమీటర్ల మేర ఉంటుందని, 536.9 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో భూసేకరణ అవార్డు జారీ చేసి భూ బదలాయింపు జరగని రైతులు, భూ యాజమానులతో చర్చించి అర్బిట్రేషన్‌కు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జాతీయ రహదారి 163జీ నిర్మాణంలో భాగంగా జిల్లా పరిధిలో 110 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉండగా ఇప్పటికే 83 హెక్టార్ల భూమి అప్పగించినట్లు తెలిపారు. మిగతాది సాగులో ఉన్నదని నవంబర్ 10లోగా అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాములు, అధికారులు పాల్గొన్నారు.

ఓరియంట్‌లో భద్రతా వారోత్సవాలు

కాసిపేట, అక్టోబర్ 22 : కాసిపేట మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో తెలంగాణ రాష్ట్ర మైన్స్ సేఫ్టీ ఆధ్వర్యంలో 39వ మైన్స్ భద్రత వారోత్సవాలను ప్రారంభించారు. జోన్ రెండుకు సంబంధించి గ్రూపుల్లో 69 మైన్స్‌లు మూడు కేటగిరిలో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఓరియంట్ ప్లాంట్ యూనిట్ హెడ్ బాల గిరిధర్, మైన్స్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

దండేపల్లి, అక్టోబర్ 22: దండేపల్లి మండలంలోని కాసిపేటకు చెందిన చిరుత లింగన్న ఇటీవల మరణించాడు. మంగళవారం అతని కుటుంబ సభ్యులకు హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కల్లెం రాజన్న, అప్పాల సునీల్, బక్కశెట్టి వెంకటేశ్, లక్కాకుల వెంకటేశ్, మదాసు వెంకటేశ్, తదితరులు ఉన్నారు.

ఐబీపీఎస్‌కు శిక్షణ

నస్పూర్, అక్టోబర్ 22 : బ్యాంకింగ్ ఐబీపీఎస్ పరీక్ష కోసం రాష్ట్రానికి చెందిన అర్హులైన ఎస్సీ, ఎస్టీ,బీసీ అభ్యర్థులకు అందిస్తున్న ఉచిత శిక్షణ కోసం దరఖాస్తుల గడువు ఈ నెల 27 వరకు పొడిగించినట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి గంగారాం ప్రకటనలో తెలిపారు. వివరాలకు 040-27540104లో సంప్రదించాలన్నారు.

నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

జైపూర్, అక్టోబర్ 22: జైపూర్‌లోని సింగరేణి విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో మంగళవారం మొదటి యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. 600 మెగావాట్ల సామర్థ్యం గల మొదటి యూ నిట్ బాయిలర్‌లో ట్యూబ్ లీకేజీతో ఆదివారం నుంచి ఉత్పత్తి నిలిచినట్లు ఉద్యోగులు పేర్కొంటున్నారు. దీనిపై అధికారికంగా ప్రకటించలేదు.

నీతి ఆయోగ్ పనులను సమర్థవంతంగా నిర్వహించాలి

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 22: నీతి ఆయోగ్ పథకం కింద జిల్లాలో చేపట్టిన వివిధ పనులను సమర్థవంతంగా నిర్వహించాలని ఎన్ఐడీసీ కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా డైరెక్టర్ సెంట్రల్ ప్రబారి రజత్ కుమార్ అన్నారు. మంగళవారం న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో నీతి ఆయోగ్ కింద కొనసాగుతున్న పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ జిల్లాలో ఆకాంక్షత (ఎక్స్పెషనల్) కార్యక్రమంలో భాగంగా నీతి అయోగ్ ఆధ్వర్యంలో 2018 నుంచి ఆరోగ్యం, పోషకాలు, వ్యవసాయ సాగునీరు, నైపుణ్యత అభివృద్ధి, ఆర్థిక సహకారం, విద్య, వైద్యం అంశాలపై ప్రత్యేక కార్యచరణ రూపొందించి ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తామని తెలిపారు. నీతి ఆయోగ్ ద్వారా మంజూరైన రూ.3 కోట్లతో జిల్లాలోని 279 అంగన్వాడీ కేంద్రాల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. మండల సమాఖ్య భవనాల నిర్మాణం, బల్క్ మిల్క్ సెంటర్, కుట్టు శిక్షణ కేంద్రాలు, డెయిరీ మిల్క్ సెంటర్, జంతు జనన నియంత్రణ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్‌వో తుకారాం, డీఆర్డీవో దత్తారాం, అడిషన్ డీఆర్డీవో రామకృష్ణ, విద్యాశాఖ అధికారి, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కబ్జా చేస్తే ఊరుకునేది లేదు

మందమర్రి, అక్టోబర్ 22: ప్రజా ప్రతినిధుల పేరు చెబుతూ సింగరేణి స్థలాలను కబ్జా చేస్తే ఊరుకునేది లేదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయు) రాష్ట్ర కార్యదర్శి ఎస్.వెంకట స్వామి హెచ్చరించారు. రామకృష్ణాపూర్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని జయశంకర్ విగ్రహం వద్ద తమ యూనియన్ పక్కన గల సింగరేణి స్థలం పై క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అధికార పార్టీకి చెందిన ఒక వార్డు కౌన్సిలర్ భర్త కన్నేసి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు.

మొక్కల సంరక్షణపై శద్ధ చూపాలి • డీఆర్డీవో కిషన్

భీమారం, అక్టోబర్ 22 : నర్సరీల్లో మొక్కల సంరక్షణపై శద్ధ చూపాలని డీఆర్డీవో కిషన్ ఆదేశించారు. భీమారం